

అందమయిన కేశములు వంశపారంపర్యముగా రావచ్చును. అయితే ఎక్కువగా కేశవర్ధిని వలనను మరియు చిన్నతనములో తీసికొన్న శ్రద్ధవలనను కేశసౌభాగ్యము శాశ్వతముగా నుండగలదు. చిన్నతనములోనే కేశవర్ధినితో కేశముల ఆరోగ్యమునకు పునాది వేయుడు; మీ పిల్లలకు అకాలములో నెరయుట, బట్టతల లేర్పడుట తప్పించుడు.

బలహీనములైన చేతులలో కండరములను వృద్ధిచేయగల్గునట్లు బొత్తిగా వెంట్రుకలే లేని తలలలో సైతము కేశవర్ధినితో కేశములు వృద్ధిచేయ వచ్చును.

మీపిల్లలకు మంచి అందమైన కేశములు పెంచగలమార్గ మున్నపుడు ఇతరుల పిల్లలను చూచి అసూయపడెద రేల? మీబిడ్డ శిరోజములవిషయమై అశ్రద్ధచేసి శిక్షింపకుడు.

# కేశవర్ధిని

నామెకు ప్రతిదినము
దీర్ఘమై అందమైన
కుంతలముల నిచ్చుటకు వాడుడు.

| | | |
|---|---|---|
| కేశవర్ధిని | అణాలు | 0–12–0 |
| కేశవర్ధిని షాంపూ | ,, | 0–12–0 |
| కేశవర్ధిని క్రీం | రూ. | 1–0–0 |

ప్యాకింగు పోస్టేజి అధికము.
వర్తకు లందరివద్దను దొరకును లేక

సౌత్ యిండియా కెమికల్సు,
మైలాపూరు, — — మదరాసు.

# అభినవభారతి

[కథానిక]

శ్రీ నిట్టల మేధాదక్షిణామూర్తి

వైకుంఠైకాదశినాడు శ్రీరంగంలో ద్వారదర్శన మహోత్సవం జరుగుతుందనీ, దానిని చూచినవాళ్ల జన్మ తరిస్తుందనీ లోకులు చెప్పుకోవడం విని తిరుమనాపల్లిలో వున్న నాకు వెళ్లా లనిపించింది. శ్రీరంగం మూడు మైళ్లలోనే వుండడంచేత తెల్లవారుజామున నాల్గుగంటల సమయంలో బయలుదేరాను. కొంచెం దూరం వెళ్లేటప్పటికి నావెంటనే వస్తూవున్న కావేరీ నది రెండుపాయలుగా చీలింది. కావేరీనదిచేత చుట్టబడి శ్రీరంగం శ్వేతద్వీపంలాగా వుంటుందని అంటారు. నా కారాత్రి వెన్నెట్లో ధగధగలాడుతూ నీలాకాశాన్ని ప్రతిఫలిస్తూ అచ్చటచ్చట ఇసుకతిన్నెలతో వున్న కవేరదుహిత భూలోకవైకుంఠ మనబడే శ్రీరంగంలో భక్తవత్సలుడై వేంచేసియున్న శ్రీమన్నారాయణుని సేవించుటకై ఆపుణ్యభూమిని కుండలాకారంగా పరివేష్టించియున్న కాద్రవేయపతిలా గోచరించింది. ఉత్సవసమాగతతైర్థికజనసాహాయ్యంతో అచ్చటి దర్శనీయవిశేషాలన్నీ చూచుకుంటూ సూర్యోదయం కాకుండానే శ్రీరంగం చేరుకున్నాను.

వెళ్లీ వెళ్లడంతోనే ప్రాలేయాచలసానుమండల సరద్వాఃపూర శైత్యములున్నూ, పరిమళమిళత్కుసుమగర్భసితతుషారాసారవాహములున్నూ, దాక్షిణాత్యకన్యలా లోతులేనివిన్నీ అయిన కావేరీనదీజలముల్లో స్నాతుడనై శ్రీరంగధామధామదర్శన కుతూహలుడనై భక్తజనప్రవాహాన్ననుసరించి వెళ్లాను. మహాకవిభావంలా మహోన్నతమైన చామీకరచారుగోపురము నా కొక్క మధురస్మృతి నిచ్చింది ప్రథమదర్శనంతోనే!

కరచరణసాహాయ్యమును కలిగి, జ్ఞానేంద్రియపంచకమును స్వాధీనముచేసుకుని మనస్సును లగ్నము చేసినగాని శ్రీరంగధాముని దర్శనం కాదన్నట్లు సప్తప్రాకారపరివేష్టితమైయున్నది గర్భమంటపము. నాలుగు ప్రాకారములు దాటినతరువాత పూజాద్రవ్య

ముల నమ్మే అంగళ్లు నాజ్ఞానేంద్రియములనూ, వాటితో కర్మేంద్రియములనూ ఆకర్షించాయి. భగవద్భక్తి వెల్లివిరియవలసిన ఆ స్థలంలో నామన స్సన్యథా వర్తిస్తున్నట్లు తోచింది. సౌందర్య మానందదాయక మనిన్నీ, ఆనందమే పరబ్రహ్మస్వరూప మనిన్నీ తర్కించి నిరూపించే యింద్రియరాజుగారి యాజ్ఞ నౌదల ధరించి నాకను లట్టే నిలువక కుసుమమాల్యములను, సుగంధద్రవ్యములను కొనుక్కునే దాక్షిణాత్య తరుణీమణుల ముఖావలోకననిమగ్నములై వారివలెనే చలించిపోతున్నాయి. నడిచేవాళ్లకుతప్ప నిలిచేవాళ్లకు చోటులేని ఆ ప్రదేశంలో నిలబడడంచేత నాశరీర మప్పుడే వెచ్చవెచ్చగా తగిలే తనూస్పర్శసుఖ మనుభవించి మఱింత నాకాంక్షిస్తోంది. ఇంతలో పూజాసమయఘంటానాదము విననవడంచేత ఒక్కసారిగా జనప్రవాహము ముందుకు సాగిపోయి గర్భమంటప సమీపంలో సుళ్లుతిరుగుతోంది.

సాధారణంగా ఆప్రదేశము కన్నులు పొడుచుకున్నా కనరాని చీకటితో వుండాలిసింది. కాని ద్వారదర్శనమహోత్సవసమయ మవడంచేత విద్యుద్దీపవిరాజమాన మైయున్నది. స్ఫటికశిలానిర్మితసహస్ర స్తంభములున్నా ఆకాంతిని యినుమడిస్తున్నాయి. రంగనాథుడు దక్షిణాశాముఖు డైయుండడంచేత తూర్పు దిక్కున నిర్మింపబడిన శిలావేదికపై ఇరువురు కూర్చుని స్వామిసన్నిధిని సంగీతకాలక్షేపం చేస్తున్నారు. నలుబదిఏండ్లపురుషు డొకడు వీణ మీటుతున్నాడు. పదిహేనేండ్ల ప్రాయము గల నవయౌవనాంగి గీత మాలాపిస్తోంది. ఆగానము, ఆవీణానాదము నాహృదయంలో ఒక్కొక్కమాటు వేయిమధుకీలలను ప్రజ్వలింపజేస్తున్నాయి. ఆరాతి స్తంభాలన్నీ కూడా స్వరమంటపంలో వున్నట్లు స్వరాలు పాడుతూ స్రవించిపోతూయున్నాయనిపించింది. సంగీతానికి రంగనాథుడు రంగరింపబడి జనప్రవాహంతోబాటు కలిసి కావేరిలో ఐక్యమైపోవలసిందే! భక్తులందరూ శ్రీరంగనాథుని దర్శించడం కోసమూ, శ్రీరంగనాథుడు వారు తెచ్చిన పంచామృతసమేతఫలాహారనివేదనల నారగించడంకోసమూ తహతహలాడిపోతూ వారి గానాన్నిగాని, ఆమె సౌందర్యాన్నిగాని ఆదరించడమేలేదు. లీలామానుషరూపుడైన రంగనాథుడు నాకోసమే ఈ సన్నివేశాన్ని కలుగజేశా డనిపించింది. ఆమె అప్పుడు "యామి హే క మిహ శరణం" అనే జయదేవకవికృతి పాడుతోంది. ఎదురుగుండా స్తంభాన్నానుకొని తదేకదీక్షతో తనవంక చూస్తూన్న నన్నుద్దేశించే ఆమె ఆ కృతి నందుకున్న దనుకున్నాను. వృద్ధుడు కన్నులు మూసుకుని పురుషత్వాన్ని స్ఫుటీకరిస్తూ గాఢంగా తంత్రులు మీటుతున్నాడు. ఆమెమాత్ర మతిచంచల లోచనములతో పరిపరి నావంక చూస్తూ పాడుతూనే వుంది. అప్పటి ఆమెసౌందర్యాన్ని ఏమని చెప్పను! ఒక్కసారి విద్యుద్దీపాల నన్నిటినీ ఆర్పితే అంతటి తేజస్సున్నూ ఆమెముఖం ప్రసరించగలదని తోచింది. వెంటనే నాకనులు మూసుకున్నాయి. ఆమెసుధామధురసౌందర్యాన్ని నామనోనేత్రము తనివితీరా దర్శించింది. దరహాసచంద్రికారోచిష్మంతములైన కపోలములతో, విశ్వనాథశిరోమాల్యరేఖామోహనములై తేజోవంతములైన కనులతో మనోహరమైన యామెముఖవికాసము సాయంసమయసూర్యశోణకిరణవర్ణితసితాంబుదమువలె, శారదచంద్రికాస్నపిత సముత్ఫుల్లమందారమువలె, అమృతస్పర్శసుఖదాతృతాసమర్థమగు నాఆత్మసౌందర్యమువలె తోచింది. ద్వారదర్శనసమయఘంటానాదము విని చలితమయి ముందు వెనక్కుల తూగుచున్న జనప్రవాహము నాచోటునుండి నన్ను త్రోసివేసింది. కనులు తెఱచి చూతునుకదా నాయెదుటనుండి యింతవరకూ నన్ను 'గంధర్వలోకమధురసుషమాసుధాగాన మంజువాటిలో' నాచిటికెనవ్రేలిని తన చిగురుకేల బట్టుకొని నా మేన విద్యుల్లతలు ప్రసరిస్తూ తిప్పుచున్న ఆసౌందర్యరాశి మాయమైంది. కోటిసూర్యప్రభాశోభాయమాన విద్యుద్దీపసంశోభితమయ్యూ ఆప్రదేశము గాఢాంధకారబంధురమై కనబడింది. ఒక్కసారి అనుకోకుండా కలిగిన ఆ సుధాధామవాససౌఖ్యంనుండి అట్లానే ఎక్కడో ఎక్కడో అధోలోకాల్లోకి త్రోసివేయబడినట్లుయింది. నా మనస్సు త్రవ్వివేయబడినట్లయి నన్నాచోట నిలవనియ్యలేదు. గాఢాంధకారజీమూతగర్భ విద్యోతిత సౌదామినీరేఖాసుషమాదృశ్యమాన మాధవీకుసుమగుచ్ఛమువలె ఒక్కనిమేషమున నన్ను శ్రీరంగ

ధాముని జేసి మరుని మేమను మనశ్శూన్యుని జేసిన ఆ సుందరి యెక్కడుంటుందో అని ఆ జనసమూహమంతా వెతుకుతూ పిచ్చివాడిలాగా తిరిగాను. అన్యమనస్కులై ఉండటంచేత కాని లేకుంటే నన్ను పిచ్చివాడని బయటికి గెంటివేసేవారే దేవాలయాధికారులు. ఉత్తరద్వారం, చంద్రపుష్కరణీతీర్థం జన్మసాఫల్యాన్ని కలిగించడానికి బదులు ప్రత్యక్షవిరోధివర్గంలో చేరేయి. సప్తప్రాకారాలు దాటాను. సమస్తేంద్రియాలూ ఏకదేశమునందు లగ్నము చేశాను. కాని అతీంద్రియమైన ఆజ్యోతి పునర్దర్శన మియ్యలేదు. తాళద్వయపరిమాణము కలిగిన రాతిపందిరిగుంజలపై తాళద్వయ పరిమాణముగల శిలాశలాక నిర్మింపబడివున్నది. ఒక్కసారి అది నామీద బడితే—!

## ౨

నాయనగారు ఆ నవమోహనాకారుణ్ని చూడనే లేదు. నా చిన్నతనంనుండీ ఈ శ్రీరంగదేవాలయం పరిచితమైనదే కాని ఎన్నడూ యిలాంటి సౌందర్యాన్ని చూడనేలేదు. ఆ స్తంభాన్ని ఆనుకొని ఆతడలా నిల్చుంటే మహాశిల్పి చెక్కిన జీవప్రతిమలా వున్నాడు. ఆ హాసరేఖావిన్యాసము, ఆశిల్పము మరెచ్చటా వుండదు. నేనిప్పటికి అయిదేండ్లనుంచీ నాన్నగారితో వచ్చి నా సంగీతకళ నీ దేవునియెదుట ప్రదర్శిస్తున్నాను. కోటానుకోట్లు వస్తున్నారు, పోతున్నారు. నా సంగీతానికి ఇంతగా ముగ్ధుడైనవాడెవ్వడైనా వుంటాడా! ఐదేళ్ల నిత్యసంగీతకళానివేదన శ్రీరంగధామునిచేత ఈ రూపంగా ప్రసాదింపబడింది. అతని తన్మయత నవలోకిస్తే అతడు వట్టి గానవేత్త కాడని తోస్తోంది. త్యాగరాజుకృతులూ విన్నాడు, జయదేవకృతులూ విన్నాడు. "యామి హే కమిహ శరణమ్" విన్నప్పుడతడెంతో చలించాడు. నావుద్దేశాన్ని అతడు గ్రహించే వుంటాడు. అతడు నావంక అనిమీలితలోచనుడై చూస్తూవున్నప్పుడు అపరిమితమైన సిగ్గూ, నాన్నగారు చూస్తారేమోనన్న భయమూ, అంతమందిజనంలో రసాభాసం అవుతుందేమోనన్న భయంతో దీక్షా ఒక్కసారి నాలో విజృంభించాయి. అప్పటికి నియమవేళాఘంట మ్రోగకపోతే పూర్తిగా రసాభాసమే అయ్యేది. దైవేచ్ఛ అలా వుందికాబోలు. ఘంట మ్రోగడం ఒకవిధంగా అనుకూలమే అయినా నాన్నగారిననుసరించి ఉత్తరద్వారదర్శనార్థమై వెళ్లవలసివుండడం నా మనస్తృప్తికి పెద్ద గొడ్డలిపెట్టయింది. గాయపడ్డ హృదయంతో అలానే అనుసరించి వెళ్లాను. పరాధీనమనస్కనై ఎప్పటికప్పుడు ఎక్కడవున్నానో తెలియకుండా నిలవబడిపోయే నన్ను నాన్నగారు హెచ్చరిస్తూండడం, వారి హెచ్చరిక నా అన్యమనస్కతకు మరింత దోహదం ఇవ్వడం జరగ్గా ఇంటికి వెళ్లేటప్పటికి పదిగంటలైంది. స్వామివారికి భోగసమయం కాబట్టి నాన్నగారు దేవాలయంలోకి మళ్లీ వెళ్లారు. అతిథిపూజకై పాకక్రియావ్యగ్రురాలై యున్నది మా అమ్మ.

ప్రసాదగ్రహణవ్యాజంతో యిల్లు వీడి దేవాలయం దారి బట్టాను కృష్ణాభిసారిణియగు గోపికలాగా. అంతటిజనంలో నేనాతణ్ణి గుర్తించకపోయినా నా పాటనుబట్టి నన్నాతడు గుర్తించగలడనే నమ్మకంతో "యామి హే కమిహ శరణా"న్నే ఉత్కంఠాగాద్గద్య మందస్వరంతో పాడుకుంటూ వెళ్లాను. పూర్వపరిచితమైన ప్రదేశమంతా తదేకదీక్షతో విలోకించాను. ఆ స్తంభాన్నానుకొని అల్లే నిల్చుని మధురస్మృతితన్మయినై ఒకగంటసేపు నిలబడ్డాను. పరదేశీయులే ఎక్కువగా ఉండడంచేత నన్నెవ్వరూ పల్కరించలేదు. నాధ్యానమునకు భంగం కాలేదు. ప్రసాదం పంచిపెట్టే సమయానికైనా రాడా అనుకొని యింతసేపూ వున్నాను. ఆ సమయం అయిపోవడంచేత జనబాహుళ్యం క్రమక్రమంగా మందగిస్తోంది. ఇక అక్కడ నిలవడం భావ్యంగాదని కావేరీనదీమార్గవర్తినయ్యాను. సప్తప్రాకారాలూ దాటివెళ్లగా ఎండ ఎక్కువౌతూ వుండడంచేత రాతిపందిరిక్రింద కొంచెంసేపు విశ్రమించాను. ఏకారణంచేతనో అక్కడ కూర్చునివున్న క్షణంలో మళ్లీ అతని సౌందర్యం గమనక్రాంతమైన నాకు మధురాతిమధురమై, వేదనాతివేదనమై హెచ్చరికనిచ్చింది. ఆశానిరాశలమధ్య నామనస్సు శరపాతశిలాతలముల మధ్యనున్న శిరీషకుసుమువలె నలిగిపోయింది. లేచి నిలబడ్డాను, ఒక్కసారి పైరాయి మీదబడితే ఎంత భాగుండును అనిపించింది. కాని

నాలో ఏదో ఒక నూతనోత్తేజము మూర్తీభవించింది. అతనికోసమే నేను జన్మించినట్లనిపించింది. ఇంతవరకూ పెనుబండవలెనున్న ఆ స్తంభము ఈభావం నామనస్సులో ఉదయించడంతోనే పొందిన పరిణామంలాగా దర్పణసదృశమై నాసౌందర్యాన్ని ప్రతిఫలించింది. నారూపలక్ష్మికి నేనే పరవశనైపోయాను. ఈ సౌందర్యానికి తగిన వినియోగం కలిగే సమయ మాసన్నమైందనే ధైర్యంతో ముందుకు నడిచాను.

## 3

తదేకస్మరణతో పంచనదతీర్థాన్ని సమీపించాను.

సూర్యకిరణములు కవేరసుహితృరసములను కోష్ణములుగా మార్చాయి. ఆనీటిలో స్నానముచేస్తూఉంటే నాప్రేయసినులివెచ్చనికౌగిలిలోని సౌఖ్య మనుభవించాను. విడిచిరా బుద్ధిపుట్టలేదు. రెండుమూడుసార్లు మునిగి లేచేటప్పటికి నామనస్సులో కవేరకన్య నాప్రేయసివలెనే కనిపించింది. అప్రయత్నంగా నాహృదయంలోనుండి కవితాధార వెలువడింది.

"నాదబిందుకళానమితనిర్హ్రాదినీ!
ఓనదీసుందరీ ! ఓనదీసుందరీ !
నా దేయమాధ్వీకనటితవీణాస్వనీ !
ఈనీటిపాయలే గానాంబుధారలై
నానోటిపాటలై నీలోన కలిసెనే !
సికతాంతరంగం తెలిసెనే ఈనీట
ముఖవినిస్సృతగానమే తెలిపె నీమనసు !
మల్లికాసుమనో మనోజ్ఞమా నీనవ్వు
సాహితీహృదయాన చంద్రికలు పర్వెనే !
చలితతరంగంబు జ్వలితాంతరంగంబు
తెలిమల్లెపూదేనె కలిసెనే ఓప్రియా,
నీమూపు నాచూపు నీరూపు నారూపు
ఏమూపు లేకుండ నేక మైపోయెనే !!
కావేరినీరాన నావాక్కు నీపాట
త్రైవేణ్యవేణిగా ప్రవహించునే సఖీ!"

అని ఒక్కసారి హేలాఖేలనలేలిహానమునై నిలువునా మునిగి కొంతదూరము మెలికలు తిరుసుతూ పోయి నిలుచున్నాను. ఎదురుగుండా దేవాలయంలో వీణమీటిన ఆచార్యులుగారు ప్రత్యక్షమయ్యారు. నా మనస్సు ఉండబట్టలేక అడుగుదా మనిపించింది కాని నానోటినుండి మాటరాకపూర్వమే స్వచ్ఛమైన ఉచ్చారణతో "తమ దేదేశము?" అన్న ప్రశ్న నాహృదయాన్ని తట్టింది. మీటడం తడవుగా మ్రోగే వీణలాగా "మాది ఆంధ్రదేశము; కృష్ణాతీరవాసిని" అన్న సమాధానము వెళ్లిపోయింది. ఆచార్యులుగారు నన్నొక్కసారి కౌగిలించుకొని, నాశిరస్సును ముద్దాడి "నీపేరేమిటోయ్" అన్నారు. 'శ్రీధరశర్మ' అన్నాను. "దేవదర్శనార్థమేనా వచ్చింది" అని అడగ్గా 'ఔ'నని వూరుకున్నాను. నన్నడగనీయకుండా వారి ప్రశ్నపరంపర కురియడం నాకు కొంత విసుగునూ, చిరాకునూ కలిగించింది. వారి విషయం వారిచేత చెప్పించుకొని వినాలనే తమకం నాకు హెచ్చిపోతోంది. అకస్మాత్తుగా "తమ నామధేయం" అన్నాను. ఆయన అదేకాకుండా మహావేశపూరితుడైన కవిలా యిలా వుపన్యసించాడు:

"నా పేరు ఆనందవర్ధనాచార్యులు. మాది అసలు కృష్ణాతీరంలో అవనిగడ్డ. మాపూర్వులు తంజావూరాంధ్రనాయకులు రఘునాథరాయలవారి కాలంలో ఆస్థానసంగీతవిద్వాంసులుగా తీసుకొనిరాబడ్డారు. మా ముత్తాత గోవిందదీక్షితులు. 'సంగీతసుధానిధి' అనే గ్రంథం వ్రాశాడు. ఆయనసంగీతసుధామాధుర్యానికి మెచ్చుకొని అప్పటిరాజుగారాయన కొబిరుద మిచ్చి గౌరవించడమే కాకుండా మాముత్తాతగారి కోరికమీదనే శ్రీరంగనాథస్వామిసన్నిధిని ప్రాతస్సాయంసమయాల్లో సంగీతకాలక్షేపం చేస్తూవుండవలసినదిగా అనుజ్ఞ ఇచ్చారు. అప్పటినుండీ మావంశీకులు ఈగ్రామంలోనే నివాస మేర్పరుచుకొని దేవసేవ చేస్తున్నారు. నేనున్నూ వంశాచారాన్ననుసరించి అట్లాగే జీవనంచేస్తున్నాను."

"ఆహా! ధన్యుడ" ననుకున్నాను. ఆయన పేరు వింటేనే యిందాకటి వీణానాదము స్మృతిపథానికి తగిలి ప్రాణవాయుప్రసారము కావించింది. తనుపరి ఆంధ్రు లని తెలుసుకోవడంతోనే పరవశుణ్ణయిపోయాను. కాని నాపరవశత్వానికి ఆచార్యులవారి కంఠస్వరంలోని మార్పు భంగంకలిగించింది. మళ్లీ ఇలా వినబడ్డది:

"నాకు ప్రథమకళత్రం సంతానభాగ్యం కలి

గించకుండానే పరమపదించింది నాయిరవై అయిదవ యేట. ఆమెతోటే యిహపరశ్రేయస్సులు రెండూ ఈ ఏట్లో కలిసిపోయాయి. మన దేశంలోనే సుప్రసిద్ధవిద్వాంసులైన రామచంద్రదీక్షితులుగారు ఈ క్షేత్రానికి వచ్చినప్పుడు దైవవశాత్తూ నా ఆభిజాత్యాన్నీ, సన్నిహితత్వాన్నీ తెలుసుకుని వారి కన్య నిచ్చి వివాహంచేశారు నాకు, పదిహేనేండ్ల వయస్సులో. నా కామె అన్నివిధాలా ఆనందాన్ని యిచ్చేది. ద్వితీయ కళత్రం వున్నదన్న మాటేగాని సంతానాన్ని యింత వరకూ ప్రసాదించలేకపోవడమే కాకుండా సామాన్య సాంసారిక సౌఖ్యానికిగూడా నన్ను బాహ్యుణ్ని చేసింది. నే నొకనాడు అభినవభారతీతీర్థంలో స్నానం చేస్తూండగా నాలుగేండ్ల పిల్ల ఒకతె ఏడుస్తూ కనబడింది. తప్పిపోయింది కాబోలునని నే నామెను పుత్రికావాత్సల్యంతో చేరదీసి బుజ్జగించి ఇంటికి తీసుకొని వచ్చాను. ఆమెతల్లిదండ్రు లెవరో నాకు ఇంతవరకూ తెలియదు. అభినవభారతీతీర్థంలో నా కామె దొరకడంచేత ఆ పేరే పెట్టుకున్నాను. ఈనది చూచినప్పుడల్లా నా భార్యసోదరిలాగా కన్పిస్తుంది. నాభార్య తన యుప్పద్వారా ఈ చిట్టితల్లిని నాకు సమర్పించుకొన్నట్లుగా ఎంచుకొని పెంచుకుంటున్నాను. ఇందాకా నువ్వు పాడిన పాట విన్నంతసేపూ నాప్రథమకళత్రమూ, నాఅభినవభారతీ నాకనులలో మెలగి నన్ను తన్మయునిచేశారు. నా సంగీతవిద్యంతా నాతల్లికి నేర్పాను. ఆమెగళంలో ఏయమృతనిర్ఝరిణి కాపురముందో కాని నే నామెపాట వింటూన్నంతసేపూ ఈలోకాన్ని చూడలేను. వీణ పట్టుకుంటా నన్నమాటేగాని నే నేం స్వరం కల్పిస్తున్నదీ నాకు తెలియకుండానే మీటుతూవుంటాను. నాకన్నతల్లికి పెండ్లీడు వచ్చింది. అయితే, శ్రీధరం! నువ్వేమి చదువుకున్నావు?"

ఆయన ఏం మాట్లాడాడో నేను వింటున్నట్టే వున్నానుగాని నా కేమీ వినబడిందికాదు. ఎంతసేపూ అభినవభారతీస్వరూపమూ, ఆ గానమాధుర్యమూ, ఆ నామధేయసార్థకతా నామనస్సును పరిపరివిధాల తిప్పుతున్నాయి వశపరచుకొని. చిట్టచివరకి నాపేరనడంతోనే ఒక సుఖస్వప్నంనుండి మేలుకొన్నట్లయి చివరిమాట వినబడ్డది. ఏం చెప్పాలో, ఏం చెప్పితే బాగుంటుందో, ఏలా చెప్పితే మంచిదో నాకు తెలిసిందికాదు. "సంస్కృతాంధ్రాల్లో సంపూర్ణసాహిత్యం వుంది" అన్నాను.

"సాహిత్యానికీ సంగీతానికీ ఏకదేశవాససంబంధం వున్నది" అన్న ఆయనవాక్యంలో నా కేవేవో అర్థాలు తోచాయి. పట్టరాని సంతోషం పరవళ్లు త్రొక్కింది నాహృదయంలో.

ఆయనకు సమాధానం చెప్పలేకపోయాను. ఇంతవరకూ నన్ను తన ఆత్మీయునిగా భావించి స్వీయకథ చెప్పుకుంటూ నావాలకం చూడలేదు. ఝాళితాంగవస్త్రాన్ని మస్తకసీమ నుంచికొని, సనాతనాంధ్రునివలె బిళ్లగోచీ పెట్టి నారసంచీలోని పట్టుబట్ట కట్టుకొని కుడిచేత్తో జారీచెంబున్నూ, ఎడంచేత్తో తడిబట్టల సంచిన్నీ పట్టుకొని నిర్గమించబోతూ "అబ్బాయీ, నాలుగురోజు లుంటావుకదూ ఈ వూళ్లో" అని అన్నారు. "చిత్తం! సామాన్యదినాల్లోతప్ప దేవాలయశిల్పవిన్యాసాన్ని చూడడానికి కవకాశం వుండదు. కాబట్టి ఒకవారంరోజులైనా వుండి తనివితీరా విశేషాలన్నీ చూసిగాని వెళ్లను" అన్నాను వారివంక ఆతురతతో చూస్తూ.

"మాయిల్లు దేవాలయానికి ప్రాగ్భాగంలో మొదటిప్రాకారంలోనే వుంది. వీలున్నప్పుడల్లా వచ్చి చూసి వెళుతూ వుండు" అని సాదరంగా వారన్న వాక్యాలు నాహృదయంలో అమృతవర్షం కురిశాయి. అప్రయత్నంగా "చిత్తం, దానికేమి, రోజూ వస్తూ వుంటాను" అన్నాను. వారు 'మంచి' దంటూనే అదృశ్యులయ్యారు జనబాహుళ్యంలో.

తండ్రిసముక్షంలో నాతో సరసాలాడడం తగదన్నట్లుగా ఆనందవర్ధనాచార్యులుగారున్నంతసేపూ లజ్జాసంకుచితశరీరయగు కన్యలా మౌననిశ్చలత్వాలు తాల్చియున్న నాప్రేయసి వారు నిష్క్రమించడంతోనే యెక్కడలేని అనురాగంతో తరంగబాహువల్లరులను చాచి నన్ను గాఢాలింగనం కావించుకొని నామీద నీళ్లుచల్లడం మొదలుపెట్టింది. శీకరాసారపరంపరాఘాతానికి ఓర్వలేక ముఖం త్రిప్పుకొని ప్రవాహాన్ననుసరించాను. నాతో ఆప్రవాహమూ, ఆప్రవాహ

ముతో నేనూ ఒండొకళ్లతో పెనవైచుకొనిపోతూన్న అప్పటి తన్మయత్వంలో నా ప్రేయసి అభినవభారతీ నామధేయము స్మృతికివచ్చింది. మాజీవనదు లావిధంగా ఏకోన్ముఖమై ప్రవహించే భాగ్యం కలుగుతుందా అని అనుకుంటూ అభినవభారతినే స్మరించుకుంటూ కొట్టుకొనిపొయ్యాను.

అలా ఎంతదూరం వెళ్లానో నాకు తెలియదు. ఎందుకు వెళ్లానోకూడా తెలియదు. అకస్మాత్తుగా నా శ్రోత్రరంధ్రములలో నా ప్రేయసి నామధేయము ప్రతిధ్వనించింది. ఎవరా అని తిరిగిచూచాను. ఒక అరవసోదరుడు వచ్చీరాని తెలుగుతో అది అభినవభారతీతీర్థమనీన్నీ, ఇచ్చట స్నానంచేసిన పుణ్యాత్ములకు సంగీతసాహిత్యవిద్యానిష్ణాతృత లభిస్తుందనీ భక్తిపూర్వకంగా వివరిస్తున్నాడు. త్యాగయ్య ఈతీర్థంలో స్నానం చేయడంచేతనే వాగ్గేయకారకు డయ్యాడనికూడా చెప్పుతున్నాడు. నా కెక్కడలేని రాగోన్మాదమూ కలిగింది. నా ప్రేమమూర్తే అనుకొని ఆతీర్థాన్ని గాఢపరిష్వంగసౌఖ్యంకోసం చేతులకొద్దీ కదిలించివేశాను. నాతమకాన్ని ఇనుమడించే కోమలకాఠిన్యం యెక్కడా లేదు. నా అల్లరి కాగలేక నా ప్రేయసి నీరైన ట్లనిపించింది. ఆమెహృదయంలో ఈవిధంగా చొచ్చుకుపోతానన్నట్లు పాములాగా కోసుగా నీళ్లలోపలకు పోయాను. నన్నామె యీవిధంగా ఆదరిస్తుందన్నట్లు కొంతదూరము పోయి నిల్చున్నాను. “నాకుమల్లే నీవు నదివలె పాఱరా” అని ఎవ్వరో అన్నట్లు అయింది. చుట్టుప్రక్కల ఎవ్వరూ కనబడలేదు.

## ౪

కావేరీతీరాన్నంతా వెయ్యికళ్లు చేసికొని గాలించాను. నామనోహరుని దర్శనం కాలేదు. మనస్సులేనిదానిమాదిరి ఒక్కమాటు నదిలో దూకాను. అప్పటికి నాకు కొంత మనస్స్వాస్థ్యము లభించింది. నాతల్లియెదుట నామనోహరుడు నన్ను స్వీకరించినట్లూ, నాతల్లి నన్నాశీర్వదించినట్లూ నా దేహము పొంగిపోయింది. నా ప్రయత్నం మొదటలో కొంతకష్టాన్ని కలిగించినా తుదకు తప్పకుండా సఫల మాతుందన్నట్లు పైపైకి నీళ్లు కొంతవేడిగా వుండి లోలోపల అతిశీతలములై తల్లిఒడిలో సౌఖ్యాన్ని కలిగించాయి. కాని మనస్సులో అనిర్వాచ్యమైన తీయని వేదనమాత్రము తీపుపెట్టుతూంది. నా ప్రియుని రూపము స్మరణకు వచ్చింది. పునరన్వేషణమునకు హెచ్చరించిన ట్లయినది. కాని ఆయన పేరేమిటో, వూరేమిటో తెలియదు. ఎవర్ని ఏమని అడిగి తెలుసుకోను? నన్ను నేనే అడుక్కున్నాను.

“ఓకళాప్రియా! ఓకళాపతీ!
గానకళారసప్లావితహృదిలో
ఏ నను మోము ఫలించెను సతిరో!
గేయవిశారదయుగ నీయెదలో
ఏయకలంకుడు వ్రాసెను చెలిరో!
శ్రీధరనృత్యవశీకృతమతిలో
గోధరు డెవ్వడు కూడెను సఖిరో!
ఓకళాప్రియా! ఓకళాప్రియా!”

వచ్చిన సమాధాన మాసుందరాకారుని సుధామధుర సౌందర్యస్వరూపమే! ఆతని ముఖనిర్గతవిజ్ఞానతేజఃపుంజమే! ఆసజీవశిల్పవిన్యాసమే!

తరువాత నా కేమీ తోచిందికాదు. గాఢాంధకారంలో మెఱుపుకాంతిలా నామనస్సులో ఒక భావం తట్టింది. నానాథు డెక్కడున్నదీ మాఅమ్మకు తెలుసునేమో? తెలుస్తే నాకు చూపిస్తుంది తప్పకుండా అని, ఏదోపాడుకుంటూ నదిలోబడి కొట్టుకుపోయాను.

కొంతదూరం పోయేటప్పటికి జనశూన్యమైన అభినవభారతీతీర్థాన్ని చేరుకున్నాను. మానాన్న నా జన్మవృత్తాంతాన్ని గురించి బాధతో చెప్పిన విషయం అంతా ఒక్కసారి జ్ఞాపకంవచ్చింది. చంటిపిల్లలా క్యావురుమన్నాను. నన్ను బుజ్జగించేందుకు నాతల్లి నన్ను కౌగిలించుకుంది. కళ్లవెంబడి నీరు ప్రవహిస్తూండగా ఇలా అన్నాను:

“అమ్మా! నన్ను కన్నతల్లినుండి విడదీసింది నువ్వు. కన్నతల్లికంటే ప్రేమతో చూసే ఆనందవర్ధనాచార్యులుగారికి నన్ను అప్పగించింది నువ్వు. మొదట్లో కష్టపెట్టినా పైమెట్టుకే తీసుకెళ్లుతున్నా వింతవరకున్నూ. నేడు మళ్లీ నీసహాయం వేడుతున్నాను.

నానాథు డెక్కడున్నాడో చూపించు. లేకుంటే నన్ను నీవే తీసుకెళ్ళిపో" అని అంటూ నీళ్లలో మునిగాను.

మునగనివ్వకుండా నన్నెవ్వరో నిలబెట్టారు. నీళ్లు ముఖంనిండా కారుతూండటంచేత యెవరైందీ స్పష్టంగా కనబడలేదు. కాని ఆస్పర్శ నాకు నూతనోత్తేజాన్ని కలిగించింది. ముఖం విదల్చి కనులు విప్పి చూచాను. నామనోహరుడే! తలవాల్చి, లజ్జాసంకుచితనై విడిపించుకోబోయాను. కాని మఱుక్షణంలో నా నాథుని—.

అలా ఎంతసేపున్నామో నాకు తెలియదు. ఎన్నాళ్లున్నా తెలిసేది కాదేమో!

తుట్టతుదకు తృప్తితీఱని హృదయాల్తోనే లోకానికి జడిసి విడివడ్డాము.

"నా మనోహరి నన్ను ప్రేమించింది, నన్ను ఆదరించింది. కాని నే నెట్లా ఆమెను గౌరవించను? ఆమెకోసం నే నీవూళ్లో ఎన్నాళ్లుంటాను? నాకు జీవనం ఎట్లా గడుస్తుంది? ఇంతవఱకూ ఎక్కడ తింటున్నానో, ఎక్కడ పండుకుంటున్నానో తడుముకోకుండా జరిగిపోతోంది. ఇలా ఎల్లకాలమూ జరుగుతుందా? ఈవూళ్లో వుండిపోతే నావుద్యోగం ఏమవుతుంది? మా ఈరహస్యసమావేశంసంగతి వింటే ఆనందవర్ధనాచార్యులుగా రేమనుకుంటారు, లోక మేమనుకుంటుంది?"

అని పరిపరివిధాల నాలో నేనే పడరాని బాధపడుతున్నాను అభినవభారతీతీర్థంలో కూర్చొని అదేపనిగా. ఇంతలో నా ప్రేయసి రసాలశాఖికపై కూర్చొనియున్న నావాలకాన్నవలోకించి 'బాలం ముకుందం' అని పాడుతూ వచ్చింది.

నామనస్సొక్కసారి నిర్మలమైంది. నా ప్రేయసి ఆక్రమించేసింది నామనస్సును. కొమ్మ దిగాను. పట్టరాని తమకంతో నా ప్రేయసిని కౌగిలించుకున్నాను. కొంచెంసేపటికి తెలివివచ్చింది.

ఇద్దరమూ ఒకరిముందు ఒకరం వేణువనంలోనుండి పోతున్నాము. ఆనిశ్శాంతప్రశాంతత మా గమనాన్ని అనుకరించి ప్రతిధ్వనిస్తోంది. మానిట్టూర్పుగాడ్పుల్నికూడా ఆ వేణురంధ్రాలు మనోజ్ఞగానంగా మారుస్తున్నాయి. మధ్యమధ్య నేరేడుపళ్లు తింటూ, ఆవెన్నెలరాత్రి ఒకరి సోయగాన్ని మరొకరం ఆస్వాదిస్తూ, ఒకరితో ఒకరు చూపుల్తో మాట్లాడుకుంటూ, అప్పుడప్పుడు స్పర్శసుఖం అనుభవిస్తూ ఎంతదూరం వెళ్లామో తెలియదు. అలా వెళ్లినంతసేపూ మేమిద్దరమూ ప్రత్యక్షంగా మాట్లాడుకోలేదు. ఇంతలో ఒక వెకురుకొంటెకోనగాడు నా ప్రేయసిచెంగు పట్టుకున్నాడు. నాకు ఒళ్లు మండిపోయింది. వాణ్ని వదిలించి గట్టిగా లాగిపుచ్చుకుని వదలిపెట్టాను. వాడు సరాసరా పదిగజాలదూరంలోవున్న మామిడిచెట్టుమీద పడ్డాడు. చెట్టు కదలి చిటారుకొమ్మని మిటాయిపొట్లాలు క్రిందపడ్డాయి. ఇరువురమూ పరుగెత్తాము ఏరుకుందామని. కాని నేను వేస్తూన్నకొంటెత్తు కనిపెట్టిన నాభారతి నావంక చూస్తున్నట్టే చూస్తూ నాకంటే ముందు పోయి నిల్చునివుండడంచేత ఆమెకే దొరికాయి రెండుపళ్లూను. ముఖంవాల్చుకున్న నన్నుద్దేశించి "ఎవరు గెల్చారూ?" అన్నది నా చెలి. నా కభిమానంవేసింది. 'నేనే' అన్నాను. 'ఎట్లా' అని మళ్లీ ప్రశ్న. "నిన్ను పంపించి పళ్లు తెప్పించుకోవడంచేత" అని అన్నాను సగర్వంగా. "అబ్బో" అంది వెటకారంగా.

ఇంతలో నాదగ్గరకు రావడానికి కింద చూడకుండా నడవడంచేత నా ప్రేయసికాల్లో ముల్లుగుచ్చుకుంది. సాధ్యమైనంతత్వరలో నేలమీద కూలబడి రాగాలాపన కారంభించింది.

"సంగీతవిదుషీమణు లనిపించుకోన్నారే" అన్నాను, ఆసమయంలో అనడం బాధాకరం అని తెలిసికూడా! కాని కోపమూ, అభిమానమూ పొంగిరాగా "మీరు ఛాందసశ్రేష్ఠు లనిపించుకోలా" అన్నది.

నాకు ఉక్రోషం కలిగిందిగాని యింక మితిమీఱడం మంచిదికాదని "నాలుగురోజుల సాహచర్యంలోనే చాలాజ్ఞానం సంపాదించావే" అన్నాను.

నా ప్రేయసి మాటలాడలేదు. బాధవల్లనో, నాప్రయోజకత్వంవల్లకాదనో!

నేను నెమ్మదిగా సమీపించి ఆమెప్రక్కనే కూర్చున్నాను. మళ్లీ బాధాసూచకంగా ఒక నిట్టూర్పు

పుచ్చింది. నే నూరుకోలేక ఆమె కాలు తీసి నా ఒడిలో పెట్టుకొని ముల్లు తీశాను. తీస్తూన్నంతసేపూ "ఏమిటండీ" అని విసుక్కుంటూనే వున్న భారతి తియ్యటంతోనే కాలు దగ్గరకు లాక్కుంది. నే నామె బాధా నివృత్తికోసం పాదసంవాహనం మొదలుపెట్టాను.

"అలా ఐతే వెళ్లిపోతాను" అంటూ లేచింది. నేను వెంబడిస్తూ "అంతకోపం ఎందుకూ, మే మెప్పుడూ భారతీపాదసంవాహకులమే" అన్నాను.

"కావచ్చు! అభినవభారతీశయ్యాపనూ త్తసుఖనిమస్నలుకూడా కావచ్చు!" అన్నది.

"కావచ్చునేమిటి? ఔదును" అన్నాను.

మఱుక్షణంలో—

## ౬

ఆనాడు శ్రీధరశర్మను కలుసుకున్నప్పటినుండీ నా బిడ్డకు తగిన వరుణ్ని శ్రీరంగనాథుడు సమకూర్చాడని అనుకుంటున్నాను. ఆ పే రెంత బాగుంది! త్రిమూర్తులూ అందులో యిమిడివున్నారు. చాలా చదువుకున్నాడట! అంతైనా—ఎంతవినయం చూపించాడు నాదగ్గఱ! అతని పేరుకు తగినన్ని గుణాలూ మా భారతి కున్నాయా? బ్రహ్మవిష్ణుల శక్తులైతే ఏమాత్రమైనా మా భారతిదగ్గర వున్నాయికాని శివుడి శక్తి లేదేమోనని నిన్నటివఱకూ భయపడుతూనే వున్నాను. కాని క్రిందటిరాత్రి వారిని వేణువనంలో అకస్మాత్తుగా చూచినప్పుడు మాభారతిలో పార్వతీ తత్వంకూడా బాగా వున్నదనుకున్నాను. దైవ మలా వుద్దేశించి యిప్పటివరకూ పెండ్లికానివ్వకుండా వుంచియున్నాళ్లకు చక్కని వరుణ్ని చూసిపెట్టినప్పుడు ఆ మాత్రం తగిన గుణాల నన్నిటినీ సమకూర్చడూ?

ఇలా అనుకుంటున్న సమయంలో భారతి తల వంచుకొని చకాచకా లోపలికి వెళ్లిపోయింది. మళ్లీ ఇటు తిరిగిచూచేటప్పటికి శ్రీధరశర్మ నమ్రుడై నమస్కరిస్తూ నిలుచున్నాడు.

"తివాచీమీద కూర్చోవోయ్" అన్నాను.

అతని ముఖంలో ఏదో తప్పుచేసి పశ్చాత్తాపపడేవాని లక్షణాలు గోచరిస్తున్నాయి. కదలకుండా మెదలకుండా అలానే కూర్చున్నాడు. నాకు తోచింది కాదు.

"ఈవూళ్లో విశేషాలన్నీ చూడడం అయిందా?" అన్నాను.

"చిత్తం! చాలామటుకు చూశానుకాని కొద్దిగా కొంటవున్నది" అన్నాడు.

"ఐతే ఇంకా ఎన్నాళ్లుంటావ్" అన్నాను.

"రే పొక్కరోజు."

ఆమాటలో ఎంతో దైన్యం కనబడింది.

"నీతో బాటు నేనూ, మా భారతీ వస్తాము" అన్నాను.

"మావూరే!" అన్నా డాశ్చర్యంతో.

"ఔను" అన్నాను దృఢంగా.

అతను మఱింత ఆశ్చర్యపడుతూ—

"మావూళ్లో ఎవ రున్నారు? మావా ళ్లెవరూ లేరు. నేను తిరుచునాపల్లిలో వుద్యోగం చేస్తున్నాను" అని చాలా కంగారుతో అన్నాడు.

"అయితే నీకోసం రాగూడదా?" అన్నాను ఏమని సమాధాన మిస్తాడో చూదామని.

"రావచ్చుగాని నే నిక్కడే వున్నానుగా" అన్నాడు ఏదో పరధ్యానంతో.

ఇంతలో భారతి వచ్చి—

"నాన్నా! ఏవూరూ ప్రయాణం" అన్నది.

"వాళ్ల వూరు" అన్నాను శ్రీధరాన్ని చూపిస్తూ.

ఇద్దరూ తలవంచుకున్నారు.

ఏం గ్రహించుకున్నారో నాపాదములకు నమస్కరించారు ఒక్కసారిగా.

నేను నామనసారా శ్రీరంగనాథుణ్ని స్మరించుకుంటూ ఆశీర్వదించాను.

———